క్లుప్తంగా

సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

తాడేపల్లిరూరల్ : డిగ్రీ విద్యార్థులకు, నిరుద్యోగులకు మానవ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు వంగర సురేష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం, కృష్ణా, ఎన్‌టీఆర్, పశ్చిమ గోదావరి జిల్లాల వారికి 22 సంవత్సరాలకు పైగా అనుభవం గల సాఫ్ ప్రాజెక్ట్ మేనేజర్‌తో ఎస్ఏపీ ఎస్డీలో శిక్షణ ఇవ్వనున్నామని, శని, ఆదివారాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించనున్నామని తెలిపారు. వివరాలకు 93937 71663, 99852 22857, 70935 29750 నంబర్లను సంప్రదించవచ్చన్నారు.

రేపు 'ధ్యాన దసరా' ఉచిత వర్క్‌షాప్

తాడేపల్లిరూరల్ : మానస సరోవర్ ధ్యాన ఆశ్రమంలో ధ్యాన దసరా పేరిట ఉచిత వర్క్‌షాప్‌ను నిర్వహించనున్నట్లు ఆశ్రమ వ్యవస్థాపకుడు కళ్ళం రామిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడేపల్లి బైపాస్‌రోడ్డులో మణిపాల్ హాస్పటల్ దగ్గర కృష్ణానది తీరాన నిర్మించిన మానస సరోవర్ ధ్యాన ఆశ్రమంలో ఈ నెల 12, 13 తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నామని, ఈ కార్యక్రమం ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు, ప్రముఖ ఫ్రీక్వెన్సీ థెరపిస్ట్ డాక్టర్ రవి నారాయణ, ప్రముఖ వరల్డ్ లాఫింగ్ థెరపిస్ట్ డాక్టర్ మహమ్మద్ ఇమ్రాన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నామన్నారు.

ఉప సర్పంచులకు శిక్షణ



ఫిరంగిపురం: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కో–ఆర్డినేటర్ మోహన్‌బాబు మాట్లాడుతూ జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి కొళాయి ఏర్పాటు చేయాలని చెప్పారు. అనంతరం పంచాయతీ రాజ్ చట్టాలపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి



ఫిరంగిపురం: శాంతిభద్రతల పరిరక్షణకు సిబ్బంది కృషి చేయాలని తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ అన్నారు. మండలంలోని గొల్లపాలెం గ్రామంలో గురువారం ఓ కేసు విషయంలో ఇరువర్గాలు పరస్పరం దూషణలకు దిగి ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. దీంతో సీఐ రవీంద్రబాబు సిబ్బందితో వెళ్లి ఇరువర్గాలవారిని పంపించివేశారు. డీఎస్పీ ఆదేశాల మేరకు తాడికొండ, మేడికొండూరు, ఫిరంగిపురం స్టేషన్లకు సంబంధించి ఇద్దరు ఎస్ఐలు, 30మంది సిబ్బందితో పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు సీఐ రవీంద్రబాబు తెలిపారు. డీఎస్పీ పికెటింగ్ ప్రాంతానికి వెళ్లి సిబ్బందితో మాట్లాడి వివరాలు సేకరించారు.

ఇసుక రీచ్‌కు గండి

తాడికొండ : తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెంలో ఇసుక రీచ్‌కు గురువారం పోలీసులు పొక్లెయిన్ సాయంతో గండి కొట్టించారు. రాత్రిళ్లు అక్రమ ఇసుక రవాణా జరుగుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఉద్దండరాయునిపాలెం, లింగాయపాలెం, మధ్య ర్యాంపులకు గండికొట్టించి వాహనాలు వెళ్లకుండా అడ్డుకట్ట వేయించారు.

రైలు నుంచి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

తెనాలిరూరల్: రైలు నుంచి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చుండూరు స్టేషన్ సమీపంలో పట్టాల వెంబడి మృతదేహం ఉందన్న సమాచారంతో తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలాన్ని గురువారం పరిశీలించారు. సుమారు 40 నుంచి 45 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. రైల్లో నుంచి జారిపడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వెంకటాద్రి తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9440627554 నంబరులో సంప్రదించాలన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

తెనాలిఅర్బన్: అమరావతి ప్లాట్స్‌లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న హామీ ఇచ్చారు. అమరావతి ప్లాట్స్‌లోని కమ్యూనిటీ హాల్‌లో గురువారం సాయంత్రం స్థానికులతో సమావేశాన్ని నిర్వహించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఉడా పరిధిలో కాలనీ ఉండేదన్నారు. నేడు పురపాలక సంఘ పరిధిలోకి వచ్చిందని, ఇక్కడ మౌలిక వసతుల ఏర్పాటుకు కృషి చేస్తామని చెప్పారు. కాలనీ వాసులు కూడా సహకరించాలని కోరారు.



మంగళగిరి: దుర్గాదేవిగా కాళీకామాత దర్శనం



మంగళగిరి: ప్రత్యేక అలంకరణలో కనకదుర్గమ్మ



మంగళగిరి: ధనలక్ష్మి అలంకరణలో రాజ్యలక్ష్మి



ఫిరంగిపురం: నుదురుపాడులో దుర్గామాత దర్శనం



దుర్గాదేవిగా శివాలయంలోని అమ్మవారు



తాడేపల్లిరూరల్: కంతంరాజు కొండూరు శ్రీ మహంకాళీ అమ్మవారికి దుర్గాదేవి అలంకారం



తాడేపల్లిరూరల్: ఉండవల్లి రెడ్ల రామమందిరం వద్ద పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

జైదుర్గ.. జై జై దుర్గ

దసరా ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం వివిధ ఆలయాల్లో అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ధనలక్ష్మీ దేవిగా మరికొన్ని ఆలయాల్లో అమ్మవారికి పూజలు చేశారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు.

– మంగళగిరి/తాడేపల్లి రూరల్



తాడేపల్లిరూరల్: పోలకంపాడులో దుర్గాదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



తాడేపల్లిరూరల్: విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై రాజ్యలక్ష్మి అవతారంలో అమ్మవారు



ఫిరంగిపురం:113 తాళ్లూరులో విశేష అలంకారంలో అమ్మవారు

నమ్మాం..నిండా మునిగాం!!

- కూటమి నేతల ధన దాహం
- ఇసుక అక్రమ రవాణాతో కృత్రిమ కొరత
- మందగించిన భవన నిర్మాణాలు
- ఇసుక లేదు..పనుల్లేవు...తిండి లేదు
- గతంలో వచ్చే సంక్షేమ పథకాలూ లేవు
- అసంఘటిత కార్మికుల ఆగ్రహం



పాతబస్టాండ్ సెంటర్‌లో పనుల కోసం ఎదురు చూస్తున్న కార్మికులు

మంగళగిరి: వారంతా అంఘటిత కార్మికులు. వారికి ప్రధానంగా ఇసుక ఉంటేనే పనులు. ఇసుక లేకుంటే పనుల్లేక పూట గడవని పరిస్థితి. ఇసుకతో ఒక్క తాపీ కార్మికుడికి మాత్రమే పని లేకపోవడం కాదు.. రాడ్ బెండింగ్.. కార్పెంటర్, ప్లంబర్.సెంట్రింగ్‌లతో అనేక రంగాలపై ఆధారపడిన వారికి ఇసుక ఉంటేనే పని. భవన నిర్మాణ రంగంపై ఆధారపడిన వారంతా నేడు అరకొర పనులతో జీవనం సాగిస్తున్నారు. మంగళగిరి పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్‌కు ఉదయం 6 గంటలకే మంగళగిరి చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు తుళ్లూరు, తాడేపల్లి మండలాల్లోని కార్మికులు పని నిమిత్తం చేరుకుంటారు. ఉదయాన్నే భోజనం క్యారేజీతో చేరుకుని ఎవరైనా పనికి పిలవకపోతారా అని ఎదురు చూస్తుంటారు. తాపీ మేస్త్రీలు తమకు అవసరమైన కూలీలను తీసుకెళ్తారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన సమయంలో వరదల కారణంగా ఇసుక కొరత ఏర్పడగా.. కొద్దికాలం పాటు భవన నిర్మాణ రంగంలో పనులు లేకపోవడంతో కూలీలు ప్రభుత్వం ఆగ్రహం వెలిబుచ్చారు. అంతేకాక రాజధాని అమరావతిలో నిర్మాణ పనులు ఆగిపోవడం కూలీలు ఆగ్రహానికి కారణమైంది. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులు ఉంటాయని భావించిన కార్మికులకు అంతకు మించి నిరాశే ఎదురైంది. టీడీపీ నాయకులు ఇసుక కృత్రిమ కొరత సృష్టించి, అధిక ధరలకు విక్రయిస్తుండడంతో సామాన్యులు భవన నిర్మాణ పనులను వాయిదా వేసుకుంటున్నారు. దీంతో కార్మికులకు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారు. కార్మికులకు రెండుమూడు రోజులకొకసారి పని లేకపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా మారింది. కనీసం దసరా పండుగకైనా పనులు ఉంటాయని భావించిన కార్మికులు పనులు దొరక్క పోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత ప్రభుత్వంలో అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత, చేదోడు, నేతన్న నేస్తం లాంటి పథకాలతో మహిళలకు బ్యాంకు ఖాతాల్లో ఏటా నగదు జమ అయ్యేది. పిల్లలకు నాణ్యమైన విద్య, భోజనం, విద్యాకానుక పేరుతో పుస్తకాలు అందిస్తుండడంతో ఎలాంటి ఇబ్బంది లేకుండా కుటుంబం గడిచేదని కార్మికులు చెబుతున్నారు. ఇప్పుడున్న ప్రభుత్వంలో పథకాలు అందక, పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, మరికొంత కాలం ఇలాగే పనులు లేక పథకాలు అందకపోతే అప్పులు పాలవుతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మూడు రోజుల నుంచి పనిలేదు

మూడు రోజుల నుంచి పని లేదు. ఈ రోజు పని దొరక్కపోతే పండగ పూట పస్తులు తప్పదు. చంద్రబాబు వస్తే పనులుంటాయని ఆశపడి ఓటు వేశాం. ఇప్పుడు చంద్రబాబుకు ఎందుకు ఓటు వేశామా అని బాధపడుతున్నాం.

– దుర్గారావు కూలి



కనీసం పథకాలూ లేవు

ప్రస్తుతం ఇసుక దొరక్క పనులు లేవు. గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు, పిల్లలకు చదువుకునేందుకు అన్ని వసతులు కల్పించారు. కొద్ది రోజులు పని లేకపోయినా అమ్మ ఒడి వంటి పథకాలతో ఎలాంటి ఇబ్బంది లేకుండా జరిగిపోయింది. ఇప్పుడు ఆ పథకాలు కూడా లేవు.

– రాజేశ్వరరావు కూలి



ఇసుక కొరతతో పనులు లేవు

పని కోసం ఉదయాన్నే ఆరు గంటలకు క్యారేజి కట్టుకుని సెంటర్‌కు వచ్చాను. మూడు రోజుల నుంచి పని దొరకడం లేదు. ఇసుక కొరత, అధిక ధరల కారణంగా భవన నిర్మాణాలు జరగకపోవడంతో కూలీలకు పనులు దొరకడం లేదు.

– సుబ్బారావు కూలి

రెండు వేలు దాటాలి

- మద్యం టెండర్లపై మంత్రి కార్యాలయం నుంచి హుకుం
- ఇప్పటివరకు 539 దరఖాస్తులు
- అందులో 350కి పైగా ముగ్గురు సిండికేట్లవే
- అందరికి వాటాలుంటాయంటున్న మంత్రి
- ఎలా ఉంటాయని ప్రశ్నిస్తున్న టెండర్‌దారులు
- మరో వైపు సిండికేట్ దారుల్లో దడ



మంగళగిరి ఎక్సైజ్ శాఖ స్టేషన్

మంగళగిరి: 'రానున్న రెండు రోజుల్లో మంగళగిరి, తాడేపల్లి నగరంలోని 19 మద్యం దుకాణాలకు రెండు వేలు దరఖాస్తులు దాటాలి. ప్రభుత్వ ఆదాయం పెరగాలి. అందరికీ వాటాలుంటాయి.. భారీగా టెండర్లు వేయాలి.' అంటూ మంత్రి కార్యాలయం నుంచి ఆదేశాలతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. మంగళగిరి తాడేపల్లి నగరంలో 19 మద్యం దుకాణాలుండగా బుధవారం సాయంత్రానికి 539 దరఖాస్తులు వచ్చాయి. 539 టెండర్లలో సిండికేట్ దారులు ముగ్గురు సుమారుగా 350కుపైగా టెండర్లు దాఖలు చేసినట్లు జోరుగా చర్చ జరుగుతుంది. మరో వైపు మంత్రి కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాలు సిండికేట్ దారుల్లో ఆందోళన రేకెత్తిస్తున్నట్లు తెలిసింది. సిండికేట్‌లను ఏకం చేయడంతో పాటు నూతనంగా టెండర్లు దాఖలు చేసిన టీడీపీ నాయకులు, కార్యకర్తలకు అందరికి వ్యాపారంలో వాటాలుంటాయని, అందరికి న్యాయం చేస్తామంటూ మంత్రి కార్యాలయం నుంచి వస్తున్న హామీలు ఎంత వరకు సఫలీకృతమవుతాయోనన్న ఆందోళన వారి నెలకొంది. మరో వైపు మంత్రి కార్యాలయం నుంచి సిండికేట్ దారులు వేసిన టెండర్ల వివరాలన్నీ తమ కార్యాలయానికి అందజేయాలని ఆదేశాలు రావడంపై వారు ఆందోళన చెందుతున్నారు. ఇంత రిస్క్ ఎందుకు అని భావించిన కొందరు టీడీపీ వ్యాపారులు.. తమకు ఎక్కడ ఆదేశాలు వస్తాయోననే ఆందోళనతో రెండు రోజులుగా ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసుకుని మరీ ఇతర ప్రాంతాలకు వెళ్లినట్లు పార్టీలో జోరుగా చర్చ జరుగుతోంది. ఇంత ఖర్చు చేసి దుకాణం వచ్చినా ప్రజాప్రతినిధులు, అధికారపార్టీ నాయకులకు, డిపార్ట్‌మెంట్‌ల వారికి నెల వారీ మామూళ్లు ఇలా ఖర్చులతో ఏ మాత్రం ఆదాయం వస్తుందని పలువురు టెండరుదారులు ఆలోచిస్తున్నట్లు తెలిసింది. దీంతో పలువురు వ్యాపారులు టెండర్లు దాఖలు వేసేందుకు వెనుకడుగు వేస్తున్నట్లు సమాచారం.

మంచితనంలో అపర కుభేరుడు..



నివాళులర్పిస్తున్న వాకర్స్ అసోషియేషన్ సభ్యులు

రతన్ టాటాకు ఘన నివాళులు

మంగళగిరి: మంచితనంలో అపర కుభేరుడు.. వ్యాపార దార్శనికుడు రతన్ టాటా అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో రతన్ టాటా చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. వేమారెడ్డి మాట్లాడుతూ రతన్ టాటా మృతి దేశానికి తీరని లోటు అన్నారు. భారత పారిశ్రామిక రంగానికే కాక ప్రపంచ పారిశ్రామిక రంగానికి రతన్ టాటా ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్, మహిళా నాయకురాలు సంకె సునీత, సీనియర్ నాయకులు ఈపూరి ఆదామ్, జాలాది జాన్‌బాబు, మన్నెం నాగేశ్వరరావు, జాలాది నాగేశ్వరరావు, బొమ్ము సాంబిరెడ్డి, పులివర్తి రాంబాబు, కురగంటి రాజేష్, గోలి సాంబయ్య, మిట్టా నిర్మల పాల్గొన్నారు. పట్టణంలో ఏకో పార్కులో వాకర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో రతన్ టాటాకు నివాళులర్పించిన వాకర్స్ ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వీసం వెంకటేశ్వరరావు, పుప్పాల కోటేశ్వరరావు, పెద్దిరాజు, అంకం బాబు, గోలి బాల మోహన్ తదితరులు పాల్గొన్నారు.



రతన్ టాటా చిత్రపటానికి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, నాయకుల నివాళి

రసవత్తరం.. వీణా అవార్డ్స్ నాటకోత్సవం

తెనాలి: వీణా అవార్డ్స్–2024 నాటకోత్సవాల్లో భాగంగా గురువారం సమకాలీన సాంఘిక పద్యనాటక విభాగంలో ప్రదర్శించిన 'యుద్ధం' భారతదేశంలో స్త్రీ శక్తినీ, కుటుంబ వ్యవస్థ గొప్పదనాన్నీ చాటింది. కళల కాణాచి–తెనాలి, వేదగంగోత్రి ఫౌండేషన్ – విజయవాడ సంయుక్త ఆధ్వర్యంలో ఇక్కడి తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో సాంఘిక పద్య నాటక, సాంఘిక నాటక, నాటికల పోటీలు జరుగుతున్నాయి. నాలుగోరోజున కళాంజలి హైదరాబాద్ ప్రదర్శించిన యుద్ధం నాటకాన్ని ఆకురాతి భాస్కర చంద్ర రచించగా, ఇందులో సందర్భోచితమైన పద్యాలను డాక్టర్ బొక్కా శ్రీనివాసరావు, పాటలను శ్రీవిరించి కూర్చారు. కొల్లా రాధాకృష్ణ దర్శకత్వం వహించారు. స్త్రీ అంటే అబల కాదు, శక్తిస్వరూపిణి, వాళ్ల నిశ్శబ్దంలోంచి అవసరమైనపుడు అఖండమైన దావానలం పుడుతుందనే ఇతివృత్తంతో రూపొందిన నాటకంలో పూర్ణ సత్యం, సురభి ప్రియాంక, నటకులం శివాజీ, తిరుమల, వరప్రసాదాచారి, సురభి నిఖిలేష్, భుజంగరావు నటించారు. సంగీతం సురభి నాగరాజు.

ఆలోచింపజేసిన '27వ మైలురాయి'

రెండో ప్రదర్శనగా మధ్యాహ్నం యంగ్ థియేటర్ ఆర్గనైజేషన్, విజయవాడ వారి '27వ మైలురాయి' సాంఘిక నాటకాన్ని ప్రదర్శించారు. రచన పీటీ మాధవ్ దర్శకత్వం వార్.వాసు. 'నిజం గెలుస్తుంది అనేది నిజమే అయినా గెలిచేదంతా నిజం కాదు' అంటుందీ నాటకం. 1993లో జరిగిన యదార్థ ఘటన ఆధారంగా రచించిన నాటకం '27వ మైలురాయి'. ప్రధాన పాత్రల్లో పి.నటరాజ్, సురభి ప్రభావతి, కుసుమ, వి.భాగ్యశిధర్, పవన్, కిరణ్, జాహ్నవి నటించారు.



'యుద్ధం' సాంఘిక పద్యనాటకంలో సన్నివేశం

సంస్కృతి వైపరీత్యాన్ని ఎండగట్టిన 'ఇది రహదారి కాదు'

మూడో ప్రదర్శనగా రాత్రి మిత్ర క్రియేషన్స్, హైదరాబాద్ వారు ప్రదర్శించిన 'ఇది రహదారి కాదు' నాటిక సమాజంలో చాపకింద నీరులా చొరపడుతున్న 'డింక్' (డ్యూయల్ ఇన్‌కమ్...నో కిడ్స్) సంస్కృతి వైపరీత్యాన్ని చాటింది. మహానగరాల్లో పెళ్లి చేసుకోకుండా 'లివింగ్ టు గెదర్' (సహజీవనం) అంటున్న నవతరం జంటలను చూస్తున్నాం. ఆ సంస్కృతి నుంచి పుట్టిన 'డింక్' వైపరీత్యాలపై రూపొందిన నాటకం అందరినీ ఆలోచింపజేసింది. ఆకురాతి భాస్కరచంద్ర రచనను ఎస్ఎం బాషా దర్శకత్వంలో ప్రదర్శించారు.

ఆకట్టుకున్న 'మా ఇంట్లో మహాభారతం'

చివరగా మద్దుకూరి ఆర్ట్ క్రియేషన్స్, చిలకలూరిపేటవారు ప్రదర్శించిన నాటిక 'మా ఇంట్లో మహాభారతం' పేరుకు తగినట్టే పలు ట్విస్టులతో సాగుతుంది. గర్భిణి అయిన ఆ ఇంటి కోడలుకు పుట్టబోయే బిడ్డను ఇంజినీరులో, డాక్టరునో చేస్తామంటారు కుటుంబసభ్యులు. ఆమె మాత్రం తనకు కలిగే బిడ్డను దేశానికి అన్నంపెట్టే అన్నదాతను చేస్తానని చెప్పే కథాంశమే ఈ నాటిక. మద్దుకూరి రవీంద్రబాబు రచనను నడింపల్లి వెంకటేశ్వరరావు దర్శకత్వంలో ప్రదర్శించారు. కళల కాణాచి వ్యవస్థాపక అధ్యక్షుడు, సినీరచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా, వ్యవస్థాపక కార్యదర్శి షేక్ జానీబాషా, ప్రధాన కార్యదర్శి గోపరాజు విజయ్, ఉపాధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు, కోశాధికారి దేవరపల్లి భవాని ఇతర కార్యవర్యసభ్యులు పర్యవేక్షించారు.

తక్కువ ధరకు వంట నూనెల విక్రయాలు

తెనాలిరూరల్: వంటనూనెల ధరలు పెరిగిన నేపథ్యంలో ప్రజలకు తక్కువ ధరలకు నూనెలు అందించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్, జిల్లా సివిల్ సప్లయిస్ అధికారులు వ్యాపారులతో సంప్రదింపులు జరిపిన ఫలితంగా పట్టణానికి చెందిన పద్మనాభుని సత్యనారాయణ అండ్ కంపెనీ ఆయిల్ మర్చంట్స్ నిర్వాహకులు తక్కువ ధరకు నూనెలు విక్రయించేందుకు ముందుకు వచ్చారని తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ గురువారం తెలిపారు. ఫ్రీడమ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్ రూ.130కి, అలాగే ప్రియా గోల్డ్/ఫస్ట్ క్లాస్/ఆల్ఫా పామాయిల్ ప్యాకెట్ రూ.119కి విక్రయిస్తున్నారని చెప్పారు. వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు పుర వేదిక వద్ద స్టాల్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా మొత్తంగా 11 షాపుల నిర్వాహకులు తక్కువ ధరలకు నూనెను విక్రయించేందుకు ముందుకు వచ్చినట్లు తహసీల్దార్ వెల్లడించారు. వ్యాపారులను అభినందించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మహిషాసురమర్దిని ఛాయా చిత్రాల ప్రదర్శన



మోదుకూరులో ఏర్పాటైన ఛాయాచిత్ర ప్రదర్శన



డాక్టర్ హైమావతి దంపతులకు సత్కారం

మోదుకూరు(తెనాలి): బాపట్ల జిల్లా చుండూరు మండలం మోదుకూరు గ్రామంలో శ్రీకనకదుర్గ అమ్మవారి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దేశవిదేశాల్లోని వివిధ శతాబ్దాలనాటి అపురూపమైన మహిషాసురమర్దిని ఛాయాచిత్రాల ప్రదర్శనను ఏర్పాటుచేశారు. యువ పురావస్తు పరిశోధకుడు పాములపాటి శ్రీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలోని వేమన సాహిత్య వికాస పరిషత్ భవనంలో ఏర్పాటైన రెండురోజుల ప్రదర్శనను గురువారం కాకతీయ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు డాక్టర్ పోలవరపు హైమావతి ప్రారంభించారు. ఆయా శిల్పచిత్రాలకు చెందిన వివరాలను శ్రీనాథ్‌రెడ్డి సందర్శకులకు వివరించారు. డాక్టర్ హైమావతి మాట్లాడుతూ ఈ ఛాయాచిత్రాలను సేకరించటం గొప్ప విషయమన్నారు. అలాంటి అపురూప ఛాయాచిత్రాలను దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో ప్రదర్శించటం భక్తులకు మంచి అనుభూతిని కలిగిస్తుందన్నారు. ప్రదర్శన ఏర్పాటు చేసిన శ్రీనాథ్ రెడ్డిని అభినందించారు. రెండురోజులపాటు జరిగే ఈ ప్రదర్శన శుక్రవారం రాత్రి 8 గంటల వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలియజేశారు. ప్రజలు, భక్తులు తిలకించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం డాక్టర్ హైమావతి దంపతులను సత్కరించారు. ఫోటోజెనిక్ ఆర్ట్ సర్కిల్ వ్యవస్థాపక కార్యదర్శి కానాల సుధాకర్‌రెడ్డి, బౌద్ధ పరిశోధకుడు తీయగూరి సీతారామరెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.